


ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

ఘనంగా మట్టల ఆదివారం

ముషీరాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్‌లో తెలుగు బాప్టిస్ట్ చర్చి ఆధ్వర్యంలో మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. రంగానగర్ మీదుగా బొంతలబస్తీ, పద్మశాలి కాలనీ, ఎస్‌బీఐ కాలనీలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాస్టర్ రెవరెండ్ సుభాష్‌లాల్ పాల్గొని దైవ సందేశం ఇచ్చారు. బాప్టిస్ట్ చర్చి కార్యదర్శి అరుణ్‌కుమార్, కోశాధికారి కిరణ్‌కుమార్, చర్చి ప్రతినిధులు లారెన్స్, సైమన్, భాస్కర్, సునీల్ పాల్గొన్నారు.

ఎంబీ చర్చి ఆధ్వర్యంలో..

రాంనగర్: మట్టల ఆదివారం సందర్భంగా గోల్కొండ చౌరస్తాలోగల ఎంబీ చర్చి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్‌జాన్, సండే స్కూల్ ఇన్‌చార్జి పీఎస్.జ్ఞానసుందరం, ఎంబీ చర్చి అధ్యక్షుడు ఎస్.జాన్‌కెనెడీ, చర్చి ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

బడీ మసీదు ముస్తాబు



రంజాన్‌ను పురస్కరించుకొని 400 సంవత్సరాల చరిత్రగల భోలక్‌పూర్‌లోని బడీ మసీదును ముత్తవల్లి నజీర్ అలీ ఆధ్వర్యంలో సుందరంగా ముస్తాబు చేశారు. రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు.

- ముషీరాబాద్, ఆంధ్రజ్యోతి



కాముడి దహనం

బాలాజీ భక్త సమాజం ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి దేవాలయం చౌరస్తాలో కాముడి దహనం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి మాజీ కార్పొరేటర్ పి. బాలరాజ్‌గౌడ్, టీడీపీ రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు చంద్రమోహన్‌గౌడ్, భక్త సమాజం సభ్యులు రమేష్ నర్సింగరావు, విజయకుమార్ గుప్తా, శంకర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

- రాంనగర్, ఆంధ్రజ్యోతి



ప్రజలను అడిగి సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వెంకటేష్

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే కాలేరు

గోల్నాక, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): కమలానగర్, న్యూకమలానగర్ బస్తీలలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఆదివారం పాదయాత్ర చేశారు. ప్రభుత్వ పథకాలు అందడం లేదని, బస్తీల్లో వీధి దీపాలు వెలగడం లేదని ప్రజలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు సంతోష్, కిషన్‌సింగ్, బక్కయ్య, మహేష్, రాజు, యదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే ప్రతిపక్ష నేతల అరెస్ట్

కవాడిగూడ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే ప్రధాని నరేంద్రమోదీ ప్రతిపక్ష నేతలపై అక్రమ కేసులు బనాయించి, వారిని అరెస్ట్ చేయిస్తున్నారని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ ఆరోపించారు. ఆదివారం దోమలగూడలో పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశంలో రెండు రాష్ట్రాల్లో ఆమ్ ఆద్మీ పార్టీ అధికారంలో ఉండటం, త్వరలో జరిగే ఎన్నికల్లో గుజరాత్, పంజాబ్, అస్సాం, హరియాణాలో పోటీ చేయనుండడంతో ఆప్ అధినేత, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీ మద్యం కేసు విచారణ మొదలై రెండేళ్లవుతున్నా వంద కోట్లలో లక్ష రూపాయలు కూడా దొరకలేదన్నారు. లిక్కర్ కేసులో నిందితుడైన అరవింద్ ఫార్మా శరత్‌చంద్రారెడ్డి బెయిల్ వచ్చిన తర్వాత రూ. 60 కోట్ల ఎలక్టోరల్ బాండ్లు బీజేపీకి ఇచ్చారని ఆరోపించారు. బీజేపీకి లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు.



రిలే నిరాహార దీక్షలో అఖిలభారత రజక సంఘం జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు అనిల్‌కుమార్, రజక సంఘం నాయకులు

రజక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలంటూ రిలే నిరాహారదీక్ష

కవాడిగూడ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): అన్ని రంగాల్లో వెనుకబడిన రజకుల అభివృద్ధి, సంక్షేమం కోసం రజక కార్పొరేషన్ ఏర్పాటుచేయాలని, రజకులను ఎస్సీ జాబితాలో చేర్చేలా అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని అఖిల భారత రజక సంఘం వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు మొగ్గ అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. రజక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో రిలే నిరాహారదీక్ష చేపట్టారు. దీక్షలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. రెండు శాతం జనాభా ఉన్న వారికి కార్పొరేషన్ ఏర్పాటు చేసి రాష్ట్ర వ్యాప్తంగా 18 లక్షల జనాభా ఉన్న రజకులకు కార్పొరేషన్ ఎందుకు ఏర్పాటు చేయలేదో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలన్నారు. రిలే నిరాహార దీక్షలో రజక సంఘం సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు భాను, సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు చీరాల రాజు, గజ్వేల్ జిల్లా నాయకులు నాగరాజు, రజక సంఘం నాయకులు కిషన్, శ్రీనివాస్, గణేష్, నవీన్, శ్రీను, రాహుల్ పాల్గొన్నారు.

మాలలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న రాంచందర్, బేర బాలకిషన్ తదితరులు

కవాడిగూడ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 50 లక్షల జనాభా ఉన్న మాలల అభివృద్ధి కోసం ప్రత్యేక మాల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర మాల సంఘాల జేఏసీ చైర్మన్ చెరుకు రాంచందర్, వర్కింగ్ చైర్మన్ బేర బాలకిషన్ కోరారు. ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మాలలు కాంగ్రెస్ పార్టీకి వెన్నంటే ఉన్నారని, అభివృద్ధి, సంక్షేమం కోసం నిధులు కేటాయించాలని, నగరంలో మాల భవన్‌కు స్థలం కేటాయించి భాగ్యరెడ్డి వర్మ కాంస్య విగ్రహం ఏర్పాటు చేయాలని కోరారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో జేఏసీ నేతలు గుడిమల్ల వినోద్‌కుమార్, తాళ్లపల్లి రవి, నాను, కనకరాజు. సత్యనారాయణ, మద్దెల ప్రభాకర్, రాజు. సుమన్ తదితరులు ఉన్నారు.

దళిత బహుజన అభ్యర్థులకే మాలల మద్దతు

కవాడిగూడ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో దళిత బహుజన పార్టీ తరఫున పోటీ చేసే అభ్యర్థులకే మాల మహానాడు మద్దతు ఇస్తుందని రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నక్కా దేవేందర్‌రావు తెలిపారు. ఆదివారం దళిత బహుజన పార్టీ కేంద్ర కార్యాలయానికి వెళ్లి పార్టీ జాతీయ అధ్యక్షుడు, సుప్రీం కోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణస్వరూప్‌ను కలిసి మద్దతు ప్రకటించారు. సంస్థ జాతీయ అధ్యక్షుడు ప్రొఫెసర్ డాక్టర్ వీఎల్ రాజు ఆదేశాల మేరకు రాజకీయ శక్తి సాధన కోసం పోరాటం చేస్తున్న దళిత బహుజన పార్టీ అభ్యర్థులకే మద్దతు ఇస్తామన్నారు. మాలలంతా దళిత బహుజన అభ్యర్థులకు ఓటు వేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రశాంత్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ యువజన సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు

భాస్కర్‌కు గౌరవ డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న భాస్కర్

రాంనగర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణలో అందించే గౌరవ డాక్టరేట్‌ను అంబేడ్కర్ యువజన సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు పేట భాస్కర్ అందుకున్నారు. ఆదివారం ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని సిటీ కల్చరల్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ కో-ఆర్డినేటర్, స్ఫూర్తి సర్వీసెస్ సొసైటీ ఇండియా చైర్మన్ డాక్టర్ ఆకుల రమేష్, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మాజీ డైరెక్టర్ డాక్టర్ యాదయ్యగౌడ్ భాస్కర్‌కు గౌరవ డాక్టరేట్ అందజేశారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ.. 30 సంవత్సరాలుగా చేస్తున్న సేవకు గుర్తింపుగా గౌరవ డాక్టరేట్ అందుకోవడం సంతోషంగా ఉందన్నారు.

కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

- ఎంపీ ఆర్.కృష్ణయ్య



ర్యాలీలో ఆర్. కృష్ణయ్య తదితరులు

రాంనగర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఆదివారం విద్యానగర్‌లో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న కృష్ణయ్య మాట్లాడుతూ.. రాష్ట్రంలో పలు విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు లక్షా యాభైవేల మంది ఉన్నారనీ, సుమారు 17 ఏళ్ల నుంచి పనిచేస్తున్నారన్నారు. తమిళనాడు, కేరళ, పశ్చిమబెంగాల్, పంజాబ్, రాజస్థాన్ తదితర రాష్ట్రాలలో కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేశారని, అదే తరహాలో రాష్ట్రంలో పనిచేస్తున్న వారిని పర్మినెంట్ చేయాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నాయకులు భరత్, నీల వెంకటేష్, పి.సుధాకర్, వెంకటేష్, నందగోపాల్, రామ్మోహన్, జి.ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

'క్షయ'తో అప్రమత్తంగా ఉండాలి



క్షయ వ్యాధి నివారణ ర్యాలీలో జస్టిస్ వామన్‌రావు తదితరులు

బర్కత్‌పుర, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): క్షయ వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించి చికిత్స అందిస్తే నియంత్రించవచ్చని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి, ఏపీ ట్రిబ్యునల్ కోర్టు మాజీ చైర్మన్ జస్టిస్ వామన్‌రావు అన్నారు. క్షయ వ్యాధితో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆదివారం బర్కత్‌పురలో రాజా బహదూర్ వెంకట్రామిరెడ్డి మహిళా కళాశాలలో ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా తెలంగాణ సిటీజన్ కౌన్సిల్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అవగాహన శిబిరం, ర్యాలీ నిర్వహించారు.

ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. స్వచ్ఛంద సేవా సంస్థలు, యువజన, మహిళా సంఘాలు గ్రామీణ ప్రాంతాలు, నగరంలోని మురికివాడల్లో క్షయ వ్యాధిపట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. షాదన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ బోయిని జగన్మోహన్ మాట్లాడుతూ.. మూడు వారాల కంటే ఎక్కువ రోజులు దగ్గు ఉండడం, జ్వరం, బరువు తగ్గడం, ఆకలి లేకపోవడం మొదలైనవి క్షయ వ్యాధి లక్షణాలన్నారు. తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజనారాయణ ముదిరాజ్ మాట్లాడుతూ.. వ్యాధిగ్రస్తులు దగ్గినప్పుడు వచ్చే కఫంను పాత్రలో పెట్టి కాల్చివేయాలన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ సంఘసేవకుడు డాక్టర్ కటకం భాస్కర్ గుప్తాకు సమాజ సేవారత్న అవార్డు - 2024 అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రుమీల సీతారాంకుమార్, సంఘసేవకులు బత్తుల హేమంత్, కో-ఆర్డినేటర్ ఎస్.నవ్య, సంజన, ఎం. సోనీ, తోట తేజస్విని, కుమారి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎన్ఎస్ఎస్ విద్యార్థినులు రెడ్డి కాలేజ్ నుంచి ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు.

ఒత్తిడి లేకుండా సివిల్స్ పరీక్షలకు సిద్ధం కావాలి

- యూపీఎస్సీ మాజీ చైర్మన్ డీపీ అగర్వాల్

చిక్కడపల్లి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఒత్తిడి లేకుండా సివిల్స్ పరీక్షలకు సిద్ధం కావాలని యూపీఎస్సీ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ డీపీ అగర్వాల్ అన్నారు. ఆదివారం అశోక్‌నగర్‌లో కృష్ణప్రదీప్ ట్వంటీఫస్ట్ సెంచరీ ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో సివిల్స్ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యూనివర్సిటీ పరీక్షలకు, పోటీ పరీక్షలకు తేడా ఉందన్నారు. వర్సిటీ పరీక్షల్లో సబ్జెక్టుల్లో పరిజ్ఞానాన్ని మాత్రమే చూస్తారని, పోటీ పరీక్షల్లో వ్యక్తిత్వాన్ని అంచనా వేస్తారన్నారు. శిక్షణ తరగతుల్లో చెప్పిన అంశాలను పాటించాలన్నారు. మూస పద్ధతిలో చదివితే మంచి ఫలితాలు రావన్నారు. అకాడమీ డైరెక్టర్లు కృష్ణప్రదీప్, డా. భవానీశంకర్ తదితరులు పాల్గొన్నారు.



పరీక్షలు చేయించుకుంటున్న శ్రీనివాస్‌రెడ్డి

వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంప్

రాంనగర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మెగా హెల్త్ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వాకర్స్ క్లబ్ హైదరాబాద్ అధ్యక్షుడు ఆర్. వివేక్ కోరారు. ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య పార్కులో వాకర్స్‌క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో అపోలో, మెడికేర్ ఆస్పత్రుల సౌజన్యంతో మెగా హెల్త్ క్యాంపు నిర్వహించారు. హెల్త్ క్యాంపును మాజీ కార్పొరేటర్ వి. శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. శిబిరానికి హాజరైన వారిని వైద్యులు పరీక్షించి మందులు అందజేశారు. క్లబ్ ప్రధాన కార్యదర్శి వెంకటస్వామిగౌడ్, కోశాధికారి కిరణ్, ఉపాధ్యక్షుడు రాజు, కల్యాణ్‌నాయక్, సభ్యులు పాల్గొన్నారు.

హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం

ఓబీసీ మోర్చా ఇన్‌చార్జిగా పూస రాజు

రాంనగర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ ఓబీసీ మోర్చా ఇన్‌చార్జిగా ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పూస రాజు నియమితులయ్యారు. ఆయన నియామకాన్ని ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్ ఆదివారం ప్రకటించారు. ఈ సందర్భంగా పూస రాజు మాట్లాడుతూ.. హైదరాబాద్ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి విజయం కోసం తన వంతు కృషి చేస్తానన్నారు.



తనిఖీలు చేస్తున్న పోలీసులు

చిక్కడపల్లిలో పోలీసుల తనిఖీలు

చిక్కడపల్లి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా ఆదివారం చిక్కడపల్లి పీఎస్ పరిధిలో పలుచోట్ల ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య పర్యవేక్షణలో పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు.

ఇన్‌స్పెక్టర్‌కు అవార్డు

సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ సీతయ్యకు వల్లూరి ఫౌండేషన్ ఆదివారం రవీంద్ర భారతిలో జరిగిన కార్యక్రమంలో ప్రతిభా పురస్కారం ప్రదానం చేసింది.

ఆకెళ్లకు సత్కారం

చిక్కడపల్లి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ మెడికల్ ఇంజనీరింగ్ రీసెర్చ్ సొసైటీలో టెక్నికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న డా. ఆకెళ్ల సర్వేశ్వరరావు ఇటీవల జీవన సాఫల్య పురస్కారం అందుకున్నారు. ఆదివారం ఆయనను వైజ్‌మెన్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్ సెంట్రల్ సంస్థ ఆధ్వర్యంలో చిక్కడపల్లిలోని సంస్థ కార్యాలయంలో సన్మానించారు. వైజ్‌మెన్ ఇంటర్నేషనల్ ఇండియా ఏరియా పూర్వ క్షేత్రాధికారి వైఎస్ఆర్ మూర్తి మాట్లాడుతూ.. కృత్రిమ మేధస్సు వేగవంతం కావడానికి సర్వేశ్వరరావు చేస్తున్న పరిశోధనలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

'జ్యోతిషం మూఢనమ్మకం కాదు'

రాంనగర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): జ్యోతిషం మూఢనమ్మకం కాదని, సైన్స్‌తో కూడిన విజ్ఞానం అని ప్రముఖ జ్యోతిష శాస్త్రవేత్త జాల సోమనాథ శాస్త్రి అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆత్మీయ సమ్మేళనం జరిగింది. తంగినపల్లి నరసింహాచారి కల్పన కృష్ణప్రియ ఆధ్వర్యంలో జరిగిన సమ్మేళనంలో జ్యోతిష శాస్త్ర విద్యార్థులు పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులలో దాగివున్న విజ్ఞానాన్ని వెలికి తీయడానికి జ్యోతిష శాస్త్రం దోహదపడుతుందన్నారు. జ్యోతిష శాస్త్రం మూఢనమ్మకాలను ప్రోత్సహించదన్నారు. జ్యోతిష శాస్త్రవేత్తలు డాక్టర్ ప్రతిభ, అనురాధ, విజయలక్ష్మి, తంగిరాల శ్రీదేవి, వరలక్ష్మి పాల్గొన్నారు.

టీచర్లకు 'టెట్' టెన్షన్

(5వ పేజీ తరువాయి)

ఇందులో దాదాపు 25 శాతం మంది రిటైర్‌మెంట్‌కు దగ్గరలో ఉన్నారు.

ఎస్‌జీటీలకు టెట్-1 తప్పనిసరి..

స్కూల్ అసిస్టెంట్ ప్రమోషన్ కోసం ఎదురుచూస్తున్న సెకండరీ ఎడ్యుకేషన్ టీచర్(ఎస్‌జీటీ)లు తప్పనిసరిగా టెట్-1 రాయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇందులో అర్హత సాధిస్తేనే రానున్న రోజుల్లో వారికి ఎస్ఏ పదోన్నతి దక్కనుంది. అలాగే, ఇప్పటికే స్కూల్ అసిస్టెంట్ కేటగిరీలో ఉద్యోగం పొందిన వారు సైతం టెట్-2 రాయాల్సి ఉంది. భవిష్యత్‌లో లభించే హెచ్‌ఎం, గెజిటెడ్ హెచ్‌ఎం లాంటి పదోన్నతులకు కూడా టెట్-1 ప్రామాణికంగా తీసుకునే పరిస్థితి ఉండడంతో వారు కూడా ఇందులో పాస్ కావాలి. కాగా, ఎన్‌సీటీఈ తాజా నిబంధనలతో ఎస్‌జీటీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 2010 నుంచి 2017 వరకు నిర్వహించిన టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్(టీఆర్‌టీ)లో ఉద్యోగం పొందిన ఉపాధ్యాయులు టెట్‌లో అర్హత సాధించేందుకు ప్రయత్నిస్తుండగా.. 1995 తర్వాత నుంచి ఉద్యోగంలో చేరిన వారు ఒత్తిడికి లోనవుతున్నారు. ఎందుకంటే వారందరూ దాదాపు రిటైర్‌మెంట్‌కు దగ్గరగా ఉండడంతో పరీక్ష రాయడం కష్టం.

ఎన్నికలకు ముందు కొందరికి న్యాయం..

ఉపాధ్యాయుల పదోన్నతులపై బీఆర్ఎస్ ప్రభుత్వం ఏళ్ల తరబడి ఊరిస్తూ వచ్చింది. ఇదిగో.. అదిగో.. అంటూ సంవత్సరాలుగా కాలయాపన చేసింది. దీంతో చాలామంది ప్రమోషన్లు పొందకుండానే రిటైర్ అయ్యారు. అసెంబ్లీ ఎన్నికలు సమీపించిన తరుణంలో గతేడాది సెప్టెంబర్, అక్టోబర్‌లో కొంతమందికి హడావుడిగా ప్రమోషన్లు ఇచ్చారు. తర్వాత షెడ్యూల్ రావడంతో ప్రక్రియకు బ్రేక్ పడింది. అప్పుడు ఎస్‌జీటీలు స్కూల్ అసిస్టెంట్ కేడర్‌కు వెళ్లగా.. స్కూల్ అసిస్టెంట్లు.. హెచ్‌ఎంలుగా, గెజిటెడ్ హెచ్‌ఎంలుగా పదోన్నతి పొందారు. వారందరూ టెట్ నిబంధన లేకుండానే ప్రమోషన్ తీసుకున్నారని, ఇప్పుడు తమకు తప్పనిసరి చేయడం ఎంతవరకు న్యాయమని పలువురు ఎస్‌జీటీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా కార్యక్రమాలతోపాటు అభ్యసన శిక్షణకు హాజరవుతూ విద్యార్థులకు మెరుగైన బోధన అందిస్తున్నామని, ఇలాంటి పరిస్థితుల్లో తమకు టెట్‌ను అర్హతగా చూపించడం తగదని వాపోతున్నారు. డీఈడీ, బీఈడీ పూర్తిచేసిన అభ్యర్థులకు టెట్ నిర్వహించి, టీఆర్‌టీ ద్వారా ఉద్యోగాలు ఇవ్వడం శుభపరిణామమని, తమకు టెట్‌ను ప్రతిబంధకంగా చూపి ప్రమోషన్లు అడ్డుకోవద్దని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

కోచింగ్ తీసుకునేందుకు పరుగులు..

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన టెట్ నోటిఫికేషన్ నేపథ్యంలో డీఈడీ, బీఈడీ పూర్తిచేసిన అభ్యర్థులతోపాటు పలువురు ఎస్‌జీటీలు, స్కూల్ అసిస్టెంట్లు సైతం కోచింగ్ తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా కొందరు ఆఫ్‌లైన్‌లో సెంటర్లకు వెళ్తుండగా, మరి కొందరు ఆన్‌లైన్‌లో ఇంటి నుంచే శిక్షణ పొందుతున్నారు. భవిష్యత్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ముందస్తుగా టెట్‌ను సాధిస్తే బాగుంటుందనే పట్టుదలతో ఉన్నారు. ఏదేమైనా ప్రభుత్వ ఉపాధ్యాయులకు టెట్ అర్హత పరేషాన్ చేస్తోందని చెప్పవచ్చు.



కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్ తదితరులు

ఆరు దశాబ్దాలు అసోసియేషన్ నిర్వహణ అభినందనీయం

చిక్కడపల్లి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఆరు దశాబ్దాల పాటు అసోసియేషన్ నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ ఎ. పావని అన్నారు. అశోక్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ 60వ వార్షికోత్సవాన్ని సంస్థ కార్యాలయంలో ఆదివారం ప్రారంభించారు. అరవై ఏళ్ల నుంచి సంస్థ తరఫున పలు కార్యాక్రమాలు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. ఈ సందర్భంగా పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు బి. రామమూర్తి, కార్యదర్శి బి. సూర్యప్రకాష్, సంయుక్త కార్యదర్శి జి. పద్మావతితోపాటు మాజీ ఐపీఎస్ అధికారి జయచంద్ర, ఆధ్యాత్మికవేత్త డా. ఎన్ అనంతలక్ష్మి, ఆంజనేయస్వామి టెంపుల్ మాజీ చైర్మన్ ప్రభాకర్‌యాదవ్, రచయిత జయసూర్య బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

'ఆయుష్మాన్ భారత్'ను సద్వినియోగం చేసుకోవాలి



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ ఉమాదేవి

బర్కత్‌పుర, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ఆయుష్మాన్ భారత్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమాదేవి సూచించారు. ఆదివారం చప్పల్ బజార్ ఇందిరానగర్‌లో ఆయుష్మాన్ భారత్ పథకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ మనోజ్‌రెడ్డి, పద్మజ, ఇందిర, సబిత, అనురాధ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ 28న అఖిల భారత సగర మహాసభ ఎన్నికలు

రాంనగర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత సగర మహాసభ ఎన్నికలను ఏప్రిల్ 28న నిర్వహిస్తున్నామని అడహక్ కమిటీ చైర్మన్ గణపతి ప్రకాష్‌రావు తెలిపారు. ఆదివారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో అఖిల భారత సగర మహాసభ సదస్సు జరిగింది. ఆయన మాట్లాడుతూ.. మహాసభ తీసుకున్న నిర్ణయాలపై సభ్యులందరూ కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు. సుల్తాన్‌బజార్ బడీచౌడిలో గల సగర విద్యార్థి వసతి గృహంలో జరిగే ఎన్నికల్లో సభ్యులందరూ పాల్గొనాలని సూచించారు. అఖిల భారత సగర మహాసభ అడహక్ కమిటీ వైస్ చైర్మన్ శ్రీరాల శ్రీరాములు, సభ్యులు ముత్యాల హరికిషన్, శాగబండ ప్రకాష్, కమటం వేణుగోపాల్, మామిడి విద్యాసాగర్, రాచకొండ గణేష్ పాల్గొన్నారు.



సీపీ బ్రౌన్‌కు నివాళులర్పిస్తున్న దామోదర్, జనార్దనమూర్తి తదితరులు

మహనీయుడు సీపీ బ్రౌన్

చిక్కడపల్లి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): వేమన పద్యాలు అర్థసహిత తాత్పర్యంతో తెలుగు జాతికి అందించిన మహనీయుడు సీపీ బ్రౌన్ అని పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ అన్నారు. త్యాగరాయగాన సభ ఆధ్వర్యంలో ఆదివారం శతాబ్దిపూర్వ మహనీయుల యాది కార్యక్రమంలో భాగంగా సీపీ బ్రౌన్ సంస్మరణ సమావేశం గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగింది. దామోదర్ మాట్లాడుతూ.. తెలుగు భాష వ్యాకరణమునకు మార్గం చూపిన తెలుగు భాషోద్ధారకుడు బ్రౌన్ అని అన్నారు. ఆంగ్ల జాతీయుడు అయినా తెలుగు భాషా నిఘంటువును వెలుగులోకి తెచ్చారన్నారు. సాహితీకిరణం సంపాదకుడు పొత్తూరి సుబ్బారావు, కళాభిమాని గుదిబండి వెంకటరెడ్డి, గాయకులు రామసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

'17 ఎంపీ స్థానాల్లో పోటీ'

బర్కత్‌పుర, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో 17 ఎంపీ స్థానాల్లో పోటీ చేస్తున్నామని ఏకం సనాతన్ భారత్‌దళ్ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్ష, కార్యదర్శులు రాజీవ్‌షా, ఎన్‌కే చతుర్వేది తెలిపారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మేనిఫెస్టో విడుదల చేసి మాట్లాడారు. పార్టీ అభ్యర్థులను గెలిపించాలని వారు కోరారు.

'సికింద్రాబాద్‌లో బీజేపీ గెలుపు ఖాయం'

గోల్నాక, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో బీజేపీ గెలుపు ఖాయమని హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు ఎన్. గౌతమ్‌రావు ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం గోల్నాక డివిజన్ అధ్యక్షుడు మూల రవీందర్‌గౌడ్ అధ్యక్షతన డివిజన్ కో-ఆర్డినేటర్లు, ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. సికింద్రాబాద్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి గెలుపునకు పార్టీ శ్రేణులు కష్టపడి పనిచేయాలని సూచించారు. అంబర్‌పేట నియోజకవర్గం కన్వీనర్ మోత్కుల శ్యామ్‌రాజ్, నాయకులు కేసరి నర్సింగ్‌రావుయాదవ్, కర్రీ రవీందర్, కె.రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

వెటరన్స్ క్రికెట్ విజేత హైదరాబాద్ హీరోస్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): వెటరన్స్ క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ (వీసీఏటీ) ఆధ్వర్యంలో నిర్వహించిన మాస్టర్స్ ప్రీమియర్ లీగ్ (ఎంపీఎల్)లో హైదరాబాద్ హీరోస్ జట్టు విజేతగా నిలిచింది. ఆదివారం జరిగిన ఎంపీఎల్ ఫైనల్లో తొలుత బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ 5 వికెట్ల నష్టానికి 157 పరుగులు చేసింది. ఛేదనలో రంగారెడ్డి రాయల్స్ 7 వికెట్లు కోల్పోయి 119 పరుగులే చేసి పరాజయం పాలైంది. విజేత, రన్నరప్ జట్లకు హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్ రావు ట్రోఫీలను, నగదు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెటరన్ క్రికెటర్లు వర్ధమాన, యువ క్రికెటర్లకు స్ఫూర్తిప్రదాతలని కొనియాడారు. ఎండ, వయసును లెక్క చేయకుండా పోటాపోటీగా ఆడిన ఇరు జట్ల క్రికెటర్లను అభినందించారు. కార్యక్రమంలో వీసీఏటీ వ్యవస్థాపక సభ్యుడు కన్నన్, సురేంద్ర అగర్వాల్, ఎస్వీవై రెడ్డి, జితేంద్ర తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో ఖేలో ఇండియా సైక్లింగ్ లీగ్

ఖేలో ఇండియా మహిళల సైక్లింగ్ లీగ్‌కు హైదరాబాద్ ఆతిథ్యమిస్తోంది. ఈనెల 30, 31 తేదీల్లో లీగ్‌ను నిర్వహిస్తున్నారు. లీగ్‌లో పాల్గొనాలనే ఆసక్తి గలవారు ఈనెల 27వ తేదీలోపు తమ పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి. వివరాల కోసం ఆర్గనైజింగ్ సెక్రటరీ మాక్స్‌వెల్ (9399395066), రేస్ సెక్రటరీ పాషా (7675805997)ను సంప్రదించవచ్చు.